క్లుప్తంగా

మాముడూరులో ఉచిత వైద్య శిబిరం

చేజర్ల : మండలంలోని మాముడూరు కమ్యూనిటీ హాల్లో కిమ్స్ హాస్పిటల్స్ సౌజన్యంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యురాలు బి.మృధుల, కిమ్స్ వైద్య బృందం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యాసామగ్రి

ఉదయగిరి : స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు పది రకాల ఆట, విద్యాసామగ్రిని అందజేసేందుకు ఉదయగిరి చెక్కనగీషి కేంద్ర నిర్వాహకులకు కలెక్టర్ కాంట్రాక్టు ఇచ్చారు. ఈ మేరకు నిర్వాహకుడు జాకీర్ హుస్సేన్ మంగళవారం మాట్లాడుతూ జిల్లాలోని 401 అంగన్‌వాడీ కేంద్రాలకు తమ కళాకారులు తయారు చేసిన రూ.15 లక్షలు విలువ చేసే విద్యాసామగ్రిని సరఫరా చేస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

సమస్యలకు వేగంగా పరిష్కారం

కలిగిరి : రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు తెలిపారు. సిద్ధనకొండూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై 46 అర్జీలు వచ్చాయి. వీఆర్వో వనిత పాల్గొన్నారు.

• **సీతారామపురం :** మండలంలోని బాలాయపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 30 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. వీటిని వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు.

దాడి చేసిన వారిపై చర్యలకు వినతి

కావలి : వృద్ధులైన తన తల్లిదండ్రులపై దాడి చేసిన కావలికి చెందిన మంచాల ప్రసాద్, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఖాజా రహంతుల్లా పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కావలిలో తన తల్లిదండ్రులతో కలిసి మంగళవారం మీడియాతో మాట్లాడారు. జలదంకిలో తన తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి రాత్రి సమయంలో వెళ్లి దాడులు చేశారని, మంచాల ప్రసాద్ వల్ల తమ కుటుంబానికి ప్రాణహాని ఉందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అల్లూరు తిరునాళ్లకు చాటింపు



అల్లూరు : అల్లూరు ఊరు, పేట తిరునాళ్లకు సంబంధించిన చాటింపులను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 31న అల్లూరు ఊరు తిరునాళ్లకు సంబంధించి రెండో చాటింపుతో పాటు జనవరి 7న జరిగే అల్లూరు పేట తిరునాళ్లకు సంబంధించి మొదటి చాటింపు కార్యక్రమాలను స్థానిక పోలేరమ్మ దేవస్థానం వద్ద జరిపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బాలకృష్ణంరాజు, శ్రీకాంత్‌రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నిరంజన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు : గంజాయి, గుట్కా తదితర మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సీఐ జి.గంగాధర్ అన్నారు. పట్టణంలోని ప్రగతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలు– సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా ఈవ్‌టీజింగ్ జరుగుతుంటే ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి.రామ్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ అమరావతి పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఉదయగిరి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ అప్పాజీ ఆదేశించారు. ఈ క్రమంలో మండలంలోని బండగానిపల్లి పంచాయతీలోని బిజ్జంపల్లి, లింగమనేనిపల్లి, కృష్ణారెడ్డిపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి చినబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాగునీటి పథకాలు, చేతి పంపులు, మురికినీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు.

• **సంగం :** సంగం గురుకుల పాఠశాలలో విద్యార్థులు జ్వరాల బారిన పడడంతో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు సబ్ యూనిట్ అధికారి ఖాదర్‌బాషా మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. లార్వా స్ప్రేయింగ్ చేశారు. ప్రిన్సిపల్ సుమతి పాల్గొన్నారు.

మామిడికి ముసురు దెబ్బ

కానరాని పూత జాడ



మామిడి రైతులను కష్టాలు వీడడం లేదు. ప్రస్తుతం వాతావరణ మార్పులతో మళ్లీ ముసురు పట్టుకుంది. దీనివల్ల మామిడి పంటను కష్టాలు వెంటాడుతున్నాయి. సాధారణంగా పూత రావడానికి రెండు నెలల ముందు మామిడి తోటల్లో తేమ ఉండకూడదు. కానీ నవంబర్‌లో విడతల వారీగా కురిసిన భారీ వర్షాల వల్ల తోటల్లో నీటి నిల్వలు చేరుకున్నాయి. దీనివల్ల పూత, పిందె, కాయలపై ప్రతికూలత ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం
- రైతుల్లో ఆందోళన

కావలి : నియోజకవర్గంలో 3,500 ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. ఇప్పటికే పూత జాడ లేదని దిగులుతో ఉన్న రైతులు, మళ్లీ ముసురు పట్టుకుని వర్షం కురుస్తుండడంతో డీలా పడిపోతున్నారు. ఇక్కడ ఎక్కువగా రైతులు ఎగుమతుల మీద ఆధారపడి పంట సాగు చేస్తారు. ముఖ్యంగా నియోజకవర్గంలో పండించే బంగినపల్లి, తోతాపురి రకాలకు మార్కెట్ ఉంటుంది. చిన్న రసాలు, పెద్ద రసాలు వంటి రకాలు అరకొరగా ఉన్నప్పటికీ పెద్దగా ఎగుమతికి అవకాశం ఉండదు.

దిగుబడిపై ఆందోళన

ఏటా వేసవి సీజన్‌లో మాత్రమే మామిడి అందుబాటులో ఉంటుంది. మూడు నెలల పాటు పంట ఉంటుంది. కానీ ఈసారి కురుస్తున్న వర్షాలు మామిడి రైతులను కలవరపెడుతోంది. అంతేకాకుండా ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తుండటం కూడా మామిడి రైతులను భయం వెంటాడుతోంది. పూతజాడ లేకపోవడం, అరకొరగా కనిపించిన పూత కూడా ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటిని తట్టుకుని బతికి బట్టకట్టిన కాయలకు అతిపెద్ద గండం ఏటా పొంచి ఉంటుంది. ఏప్రిల్, మే నెలల్లో వచ్చే ఈదురుగాలులు, వర్షాల భయం మామిడి రైతులను కలవరపెడుతోంది. దీంతో పాటు వడగళ్ల వానలు, రకరకాల వైరస్‌లు మామిడికి శాపంగా మారుతున్నాయి. చెట్టు మీద ఉండగానే మామిడి కాయ పురుగుపడుతోంది. పండు కాకముందే అవి పనికిరాకుండా పోతున్నాయి. దీంతో దిగుబడి బాగా తగ్గిపోతోందని ఆందోళన చెందుతున్నారు.



మామిడి చెట్లకు అరకొరగా పూసిన పూత

గతేడాది లాభాలు ఈసారి వచ్చేనా?

గతేడాది ఒక హెక్టార్‌కు (2.5 ఎకరాలు) రైతులు నవంబర్ నుంచి మే వరకు మామిడి పెట్టుబడి కింద రూ.50,000 నుంచి 60,000 ఖర్చు పెట్టారు. హెక్టారుకు 10 టన్నుల నుంచి 15 టన్నులు మామిడి దిగుబడి వచ్చింది. ఒక టన్ను కనిష్ట ధర రూ.35,000 ధర పలికితే, గరిష్టంగా రూ.1.5 లక్ష కూడా వెళ్లింది. స్థానిక మార్కెట్, ఎగుమతులకు ఉన్న డిమాండ్ తదితర అంశాల ప్రాతిపదికపై మామిడి ధరలు ఉంటాయి. ఈ నేపథ్యంలో గతేడాది మామిడి రైతులు మంచి లాభాల తీపి రుచి చూశారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొని ఉన్న నేపథ్యంలో మామిడి పూత జాడ కరువవడంతో దిగుబడి పట్ల ఆందోళనతో ఉన్న రైతులు ఇప్పుడు ఖర్చు చేస్తున్న పెట్టుబడిని కూడా భారంగానే భరిస్తున్నారు.



పూత కనిపించని మామిడి చెట్లు

ఇలా చేయాలి



చలి ఎక్కువగా ఉన్నప్పుడు మొగ్గలు రావడం ఆలస్యమవుతుంది. ఈ పరిస్థితులు ఉన్నప్పుడు లీటరు నీటికి 10 గ్రాముల మల్టీ– కె (పొటాషియం నైట్రేట్)ను 5 గ్రాముల యూరియా చొప్పున కలిపి చెట్లపై రెమ్మలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. దీనివల్ల ఫలితముంటుంది.

– ఎం.సుధామయి, ఉద్యాన అధికారిణి, కావలి

గ్రామాల్లో వైద్యసేవలు

వరికుంటపాడు : మండలంలోని నార్త్ కొండాయపాళెంలో వైద్యాధికారిణి డాక్టర్ ఆయేషా ఆధ్వర్యంలో 104 వాహన వైద్యసేవలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా 40 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

నరసారెడ్డిపాళెంలో..

కలిగిరి : మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ నరసారెడ్డిపాళెంలో 104 వాహనం ద్వారా కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ మంగళవారం వైద్యసేవలు అందించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

28న మండల సమావేశం

ఉదయగిరి : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 28న స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మూలె పద్మజ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

బిట్రగుంట : బోగోలు మండలంలోని కప్పరాళ్ల తిప్ప, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం తదితర గ్రామాల్లో జిల్లా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం మెరుపుదాడులు చేశారు. సారా తయారీకి అనుకూలంగా ఉండే స్థావరాలు, అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం స్థానికులకు సారా తయారీ, విక్రయాల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కలిగించారు. సారా తయారీ, విక్రయాల గురించి ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమేష్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జగదీష్‌రెడ్డి, కావలి, బుచ్చిరెడ్డిపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, జలీల్‌ఖాన్ పాల్గొన్నారు.

పోరుబాటను జయప్రదం చేద్దాం



ఆత్మకూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



వింజమూరులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

• వైఎస్సార్‌సీపీ నేతల పిలుపు

ఆత్మకూరు : కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు మొదలుపెట్టిందని, దీనికి నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టే పోరుబాటను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని ఆయన కార్యాలయంలో పార్టీ నేతలు మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, బూత్ కమిటీల జిల్లా అధ్యక్షుడు మాముడూరు సుధాకర్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్యలు మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, ఐదు నెలలకే బాదుడు ప్రారంభించారని తెలిపారు. ఈనెల 27న నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ నుంచి విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని, అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, పి.రమేష్‌రెడ్డి, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, వెంగళరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, జబ్రము పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

వింజమూరు(ఉదయగిరి) : విద్యుత్ చార్జీల పెంపుపై ఈనెల 27న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. వింజమూరులో నియోజకవర్గ ముఖ్య నేతలు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయగిరి బస్టాండ్ నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నేతలు, శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, ఎం.తిరుపతినాయుడు, కాటం రవీంద్రారెడ్డి, స్థానిక నేతలు అనంగి రమణయ్య, మద్దూరు బాబు, చిన్నికృష్ణారెడ్డి, పల్లాల కొండారెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి, మాగంటి సిద్ధయ్య, మలిరెడ్డి విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఆత్మకూరురూరల్ : వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మకూరు సబ్ డివిజన్ ఏడీఏ దేవసేనమ్మ అన్నారు. మండలంలోని వెన్నవాడలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె హాజరై, మాట్లాడారు. వరిసాగులో రైతులు ఎక్కువ మోతాదులో ఎరువులను వినియోగించరాదన్నారు. మండల ఏఓ కిశోర్‌బాబు వరిలో ఆశిస్తున్న పురుగులు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ దీప పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సీతారామపురం : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం సింగారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని సాగులో ఉన్న వరిపైరును సందర్శించారు. వరిలో జింకు లోపం ఉన్నట్లు గుర్తించి దాని నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్‌సల్ఫేట్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు స్వప్న, నరేంద్ర, ఏఎంసీ మార్కెట్ యార్డు అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్ : వెన్నవాడలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

• **మర్రిపాడు :** మండలంలోని చిన్నమాచనూరు, అల్లంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల ఏఓ ఎస్.రామ్మోహన్ మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నమాచనూరు గ్రామంలో సాగులో ఉన్న వరిపంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, వీఏఏలు షాజియా, పవన్ పాల్గొన్నారు.



సీతారామపురం : వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ



మర్రిపాడు : చిన్నమాచనూరులో..

భూ ఆక్రమణపై ఫిర్యాదు

ఆత్మకూరు : తన భూమిని ఆక్రమించారని మండలంలోని బోయలచిరివెళ్ల దళిత కాలనీకి చెందిన రామకృష్ణ ఆత్మకూరు ఆర్డీఓ పావనికి మంగళవారం ఫిర్యాదు చేశాడు. సర్వే నంబర్ 75లో 0.55 సెంట్ల భూమిని ఓ రైతు ఐదేళ్ల నుంచి ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని, దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఆర్డీఓ స్పందిస్తూ తహసీల్దార్ సుధీర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో వినియోగదారుల దినోత్సవం

ఉదయగిరి : స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎల్.నారాయణస్వామి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండబిట్రగుంటకు ప్రత్యేక బస్సు

కావలి : బోగోలు మండలంలోని కొండబిట్రగుంటకు ప్రతి శనివారం ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు కావలి నుంచి బయలుదేరుతుందని, సాయంత్రం 4 గంటలకు కొండబిట్రగుంట నుంచి తిరుగు ప్రయాణమవుతుందని తెలియజేశారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

అల్లూరు : గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ తిరునాళ్లను అన్నిశాఖలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీఓ వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో వారు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామోత్సవానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్, పురపాలక శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, దేవదాయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వర్షం.. రైతుకు నష్టం

ఉదయగిరి : అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలోని వరికుంటపాడు, వింజమూరు, దుత్తలూరు మండలాల్లో మంగళవారం వర్షాలు కురిశాయి. దీనివల్ల కోతకు వచ్చిన మినుము పంట దెబ్బతింది. ముఖ్యంగా వరికుంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో రెండు మూడు రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న మినుము పంటకు తీవ్ర నష్టం కలిగినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ వర్షాలు మరో రెండు మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉండటంతో మినుము, పెసరతో పాటు కోతమీదున్న వరి పైరుకు కూడా నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

• **సంగం :** మండల పరిధిలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో పాటు చలితీవ్రత పెరిగింది.

• **చేజర్ల :** మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి ముసురు పట్టి చిరుజల్లులు కురిశాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్రిస్మస్ కోలాహలం




ఆత్మకూరు : టిడ్కో భవనాల వద్ద దుప్పట్ల పంపిణీ

ఆత్మకూరు : యేసు క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండగ బుధవారం జరుగనున్న నేపథ్యంలో మున్సిపల్ పరిధిలో ముందురోజు నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ సునీలత, సూపర్‌వైజర్ రత్నమ్మలు మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నిర్వాహకులు షకీలా, ఆయా విజయమ్మ పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. టిడ్కో భవనాల్లో పాస్టర్ రిలీఫ్ గాస్పల్ మెమోరియల్ చర్చి నిర్వాహకుడు రెవరెండ్ కె.స్టీఫెన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. హ్యూమన్ రైట్స్ మండలాధ్యక్షురాలు మాదాల కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలో క్రిస్మస్ ట్రీ, పూలహారాలు, స్టార్లు, విద్యుత్ బల్బులు విక్రయాలు జోరుగా సాగాయి.

• **సీతారామపురం :** స్థానిక వేదగర్భ పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఫాదర్ ప్రభాకర్ మాట్లాడుతూ క్రిస్మస్‌ను ప్రేమ, కరుణ చాటుతూ నిర్వహించుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

• **ఉదయగిరి :** నియోజకవర్గంలోని ప్రార్థనా మందిరాలు క్రిస్మస్‌కు ముస్తాబయ్యాయి. 139 ఏళ్ల చరిత్ర కలిగిన ఉదయగిరిలోని బర్డిట్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కాగా నియోజకవర్గ క్రైస్తవులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

• **సోమశిల :** అనంతసాగరం మండలంలోని సోమశిల, మంచాలపల్లి, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరాలకు విద్యుద్దీపాలంకరణ చేశారు. కాగా మంచాలపల్లి గ్రామంలో రోమన్ క్యాథలిక్ మిషన్ ప్రార్థనా మందిరంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తుమ్మ మరియచౌరి క్రిస్మస్ సందేశాన్ని అందించారు.



ఉదయగిరిలోని చారిత్రక చర్చి

• **వింజమూరు(ఉదయగిరి) :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం రాత్రి నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విస్తరణాధికారి గోపీశ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• **సీతారామపురం :** మండలంలోని పలు గ్రామాల్లో ప్రార్థనా మందిరాలు అందంగా ముస్తాబయ్యాయి. ఇప్పటికే గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు మొదలయ్యాయి. భక్తులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సంతోషంగా జరుపుకోవాలి

• మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు : ప్రపంచానికి శాంతిని బోధించిన యేసు క్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం క్రిస్మస్ పండగను పురస్కరించుకుని ఆయన క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్వీట్ల పంపిణీ

వింజమూరు(ఉదయగిరి) : వింజమూరులోని అన్న క్యాంటీన్‌లో మంగళవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గంలోని క్రైస్తవులకు కాకర్ల ట్రస్ట్ ద్వారా స్వీట్లు పంపిణీ జరిగింది. విశ్రాంత డీఎంహెచ్‌ఓ కె.మాళిలామణి హాజరై, దీనిని అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు మహేష్, మధురెడ్డి పాల్గొన్నారు.

• **కలిగిరి :** మండల కేంద్రంలోని ఫిలదెల్ఫియా ప్రార్థనా మందిరాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ది లార్డ్ గాస్పల్ చర్చిని విద్యుద్దీపాలు, క్రిస్మస్ ట్రీలతో ముస్తాబు చేశారు.



సీతారామపురం : వేదగర్భ పాఠశాలలో..



విద్యుద్దీపాల వెలుగుల్లో సీతారామపురం చర్చి



వింజమూరు ఎంపీడీఓ కార్యాలయంలో..



సోమశిల : అనంతసాగరం మండలంలో..